ప్రజాశక్తి
ఆదివారం 12 మార్చి 2023
5
విజయనగరం



ర్యాండమైజేషన్ ద్వారా కేంద్రాల కేటాయింపు

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 13న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఎన్నికల సిబ్బందికి ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్ ఆధ్వర్యంలో శనివారం ఎన్ఐసిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్, ఇతర పోలింగ్ సిబ్బందిని, మైక్రో అబ్జర్వర్లను ర్యాండమ్‌గా కేటాయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సూర్యకుమారి, డిఆర్ఒ గణపతిరావు, ఎన్ఐసి డిఐఒ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డిఆర్ఒ

ముగిసిన ప్రచారం

సోషల్ మీడియా వేదికగా విస్తృత ప్రచారం

ముందంజలో డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

కుల, ధన, గిఫ్ట్ ప్యాక్‌లతో వైసిపి, ఇతర పక్షాలు

ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ

ఈ నెల 13న జరుగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం శాసన మండలి ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంతో ముగిసింది. పోలింగ్‌కు ఇంకా 24గంటల సమయం మాత్రమే ఉంది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటలు వరకు పోలింగ్ జరుగనుంది. పోటీలో 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభతో సహా పలు రాజకీయ పార్టీలకు చెందిన వారు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 37 మంది బరిలో ఉన్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో మొత్తం 2,89,214 మంది ఓటర్లు ఉండగా, ఒక్క విజయనగరం జిల్లాలో 58, 502 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 18520 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రజాశక్తి - విజయనగరం

గత నెల 16న నామినేషన్లతో ప్రారంభమైన ప్రచారం ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాల్లోనూ ముమ్మరంగా సాగింది. అభ్యర్థులంతా ఈసారి సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రోగ్రెసివ్ డెమక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) ప్రచారం ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రభంజనంలా సాగింది. ప్రజా సంఘాల శ్రేణులు విస్తారంగా పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పేరును పట్టభద్రుల్లో ప్రచారం చేయడంతో ఆమె ముందంజలో ఉన్నారు. మరోవైపు సోషల్ మీడియాలోనూ ప్రచారం హోరెత్తింది. అనేక సంవత్సరాలుగా ఉత్తరాంధ్ర జిల్లాలను పీడిస్తున్న ప్రధాన ప్రజా సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళా రంగాలకు చెందిన అంశాలే అజెండాగా పిడిఎఫ్ చేపట్టిన ప్రచారం సర్వత్రా ఆమోదయోగ్యంగా నిలిచింది.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రత్యేక సెలవు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రభుత్వ ఉద్యోగులతోపాటు పోలింగ్ రోజున కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రత్యేక సెలవు వర్తింపజేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. ఎపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీతోపాటు కేంద్ర ప్రభుత్వ పథకాల అమల్లో పని చేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి కూడా ఈ సెలవు వర్తిస్తుందని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ బరిలో ప్రధాన రాజకీయ పార్టీలు

ప్రధాన రాజకీయ పార్టీలైన వైసిపి, తెలుగుదేశం, బిజెపికి చెందిన అభ్యర్థులు బరిలో ఉండడం ఈ దఫా ఒక ప్రత్యేకతగా ఉంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బిజెపి అభ్యర్థి పివిఎన్ మాధవ్‌కు మద్దతు ఇవ్వడంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా ఆయన గెలిచారు. ఈసారి ఈ రెండు పార్టీలు వేర్వేరుగా బరిలోకి దిగాయి. దీంతో రూ.కోట్లు ఖర్చుపెట్టి నెగ్గే పనిలో బిజెపి నిమగ్నమైంది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు కూడా రూ.కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడలేదు. గత ఎన్నికల్లో వైసిపి నుంచి అభ్యర్థి బరిలో లేడు. ఈ సారి రియల్ ఎస్టేట్ వ్యాపారి సీతంరాజు సుధాకర్ ను ఆ పార్టీ పోటీకి దింపింది. రూ.కోట్ల ఖర్చుతో గట్టెక్కాలని ఇప్పటికే ఆయన డబ్బులు, గిఫ్ట్‌లు పంపకాలకు పాల్పడ్డారు.

ప్రలోభాలను తిప్పికొట్టనున్న పట్టభద్రులు

ప్రభుత్వ విధానాలతో విసిగి వేసారిపోయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగ పట్టభద్రులు వైసిపి, బిజెపి, టిడిపి అభ్యర్థుల ప్రలోభాలను తిప్పికొట్టేందుకు సన్నద్ధంగా ఉన్నారు. వైసిపి అభ్యర్థి డబ్బు పంపిణీ, బహుమతులు, వెండి నాణేలు, చీరలు ఇతర సామగ్రి పంపిణీని పెద్ద ఎత్తున పట్టభద్రులకు ఇవ్వజూపారు. టిడిపి కూడా అదే తోవలోనే నడుస్తోంది. బిజెపి నుంచి సిట్టింగ్ అభ్యర్థే రంగంలో ఉండడంతో పెద్ద ఎత్తున ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారు.

అనర్హులకు ఓటు హక్కు

శృంగవరపుకోట : ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమంగా గెలిచేందుకు వైసిపి ప్రభుత్వం అనర్హులకు ఓటు హక్కు కల్పించిందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆరోపించారు. శనివారం పట్టణంలో స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బోగస్ ఓట్లను ప్రభుత్వం తొలగించలేదన్నారు. ఈవిషయాన్ని ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. అనర్హులకు ఓటు హక్కును కల్పించిన వైసిపి నాయకులపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జులు ఇందుకూరి శ్రీనురాజు, కాపుగంటి శ్రీనివాస్, రెడ్డి వెంకన్న, ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభంజనంలా పిడిఎఫ్ ప్రచారం

పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఉమ్మడి జిల్లాల్లోని 118 మండలాలల్లో తమ పర్యటనను పూర్తి చేసుకుని, 40వేల మందికి పైగా పట్టభద్రులైన ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి ఓటును కోరడం ఈ ఎన్నికల్లో ఓ ప్రత్యేకత. ఉమ్మడి జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లోకి సైతం ఆమె గళం వెళ్లింది. చాలా హుందాగా ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు ఇలా అన్ని వర్గాల ప్రజల సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తిగా వారందరి మన్ననలూ పొందారు. దీంతో సర్వత్రా పిడిఎఫ్ అభ్యర్థికి పట్టభద్రుల ఓటర్లు బ్రహ్మరథం పట్టారు.

250 ప్రజా సంఘాలు బలపరచిన వ్యక్తిగా ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలో ఆమె పేరు మార్మోగుతోంది. ఉతరాంధ్ర ప్రాంత అభివద్ధి, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడబడాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీ గెలవాలని విద్యావంతులు కోరుకుంటున్నారు. బరిలో నిలిచిన అంత మంది అభ్యర్థుల దాటుకుంటూ ఓ మహిళా అభ్యర్థి ముందంజలో ఉండడంతో అధికార పార్టీ వెన్నులో వణుకు ప్రారంభమైంది. ఎంత ఎక్కువగా ప్రలోభాలకు పట్టభద్రులను గురిచెయ్యాలనే తపనతో వైసిపి శ్రేణులను, బయట నుంచి కిరాయికి తెచ్చుకున్న యువతను వినియోగిస్తూ అక్రమాలకు పాల్పడేందుకు సన్నద్ధమయ్యారు. వీటన్నింటినీ, చైతన్యంతో ఉత్తరాంధ్ర పట్టభద్రులు తిప్పికొట్టి పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, నగర ప్రజలు

రమాప్రభను గెలిపించాలి

పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతుగా ప్రజా సంఘాల ఆధ్వర్యాన బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 13న జరుగనున్న ఉత్తరాంధ్ర పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ విజయనగరంలో శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యాన బైక్ ర్యాలీ నిర్వహించారు. కోట జంక్షన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ మూడులాంతర్లు, ఎమ్‌జి రోడ్డు, గంటస్తంభం, కన్యకా పరమేశ్వరి ఆలయం, ఎన్‌సిఎస్, రైల్వేస్టేషన్, మయూరి జంక్షన్ మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల, ఉద్యోగ సంఘాల నాయకులు ఎం.శ్రీనివాస, సిఐటియు నాయకులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం పోరాడుతున్న శక్తులకు అండగా నిలిచినది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని అన్నారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, ఉత్తరాంధ్రలో నీటివనరుల వినియోగానికి సంబంధించి ప్రాజెక్టుల కోసం, నిరుద్యోగులు, విద్యార్థులు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న పిడిఎఫ్ అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి, వైసిపిలు రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీలు కోసం మాట్లాడటం లేదని అన్నారు. మూసివేసిన పరిశ్రమలు తెరిపించాలని, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని పిడిఎఫ్ డిమాండ్ చేస్తోందన్నారు. యాప్‌లతో ఉద్యోగ ఉపాధ్యాయులను వేధిస్తున్న వైసిపి, రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపిలను ఓడించాలని కోరారు. ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రెడ్డిశంకర్రావు అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎపి మెడికల్ రిప్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యు ఎస్ రవికుమార్, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు, ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచంద్ర రావు తదితరులు మాట్లాడారు. ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. శనివారం పట్టణంలో కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ 250 ప్రజా సంఘాలు బలపరిచిన, సామాజిక కార్యకర్త, విద్యావేత్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మద్దతివ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై ఆమె గొంతెత్తిన తీరు అందరినీ ఆలోచింపజేస్తోందని చెప్పారు. రమాప్రభను గెలిపిస్తే ఉత్తరాంధ్ర సమస్యలపై శాసనమండలిలో ఆమె గళం వినిపిస్తారని తెలిపారు.

బొబ్బిలి : ప్రజలు, కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలపై అవగాహన ఉన్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి కోరారు. యుటిఎఫ్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ శాసనమండలిలో ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు, విద్యార్థుల పక్షాన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పని చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట.. ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రూ.739 కోట్లతో రామతీర్థసాగర్ పనులు

- 1400 కుటుంబాలకు రూ.75కోట్ల పరిహారం
- మూడు గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు అనుమతి
- ఇరిగేషన్‌శాఖ నార్త్‌కోస్ట్ చీఫ్ ఇంజినీర్ సుగుణాకరరావు

మాట్లాడుతున్న సుగుణాకరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

రామతీర్థసాగర్ ప్రాజెక్టు పనులు ఐదు ప్యాకేజీలతో రూ.739 కోట్లతో జరుగుతున్నాయని ఇరిగేషన్‌శాఖ నార్త్‌కోస్టు చీఫ్ ఇంజినీర్ ఎస్.సుగుణాకరరావు తెలిపారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నిర్వాసితులైన ఒక్కో కుటుంబానికి రూ.5.5లక్షలు చొప్పున 1400కుటుంబాలకు రూ.75కోట్లు మంజూరైందని తెలిపారు. ఆర్అండ్ఆర్ కోసం రూ.174కోట్లు అవసరమని, తొలి విడతగా రూ.34కోట్లు మంజూరయ్యాయన్నారు. ఒటిఎస్ కూడా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఖరీఫ్ సీజన్‌లో తోటపల్లి ద్వారా 13వేల ఎకరాలకు సాగునీరందించామని, మిగతా 8వేల ఎకరాల ఆయకట్టు భూములకు ఈ సీజన్‌లో నీరందిస్తామని తెలిపారు. కుడి, ఎడమ కాలువలకు సుమారు 55 కిలోమీటర్ల పొడవునా లైనింగ్ పనులు ప్రారంభించామన్నారు. వందేళ్ల క్రితం నాటి హెడ్ వర్క్స్ రక్షణ కోసం రూ.173కోట్ల సాయంతో ప్లాన్ గ్రాంటు కింద నిధులు మంజూరవుతాయని తెలిపారు. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో రూ.43 కోట్లతో రాముడువలస, లోచర్ల ఎత్తిపోతల పథకాల పనులు చేపట్టామన్నారు. రూ.53కోట్లతో వెంగళరాయసాగర్, రూ.14కోట్లతో పెదంకలాం, రూ.38కోట్లతో వట్టిగెడ్డ, రూ.24కోట్లతో పెద్దగెడ్డ రూ.18కోట్లతో ఆండ్ర ప్రాజెక్టుల కాలువ లైనింగ్ పనులు జరుగున్నాయని తెలిపారు. జంఝావతి ప్రాజెక్టు కోసం ఒడిశాలో ఐదు గ్రామాల నుంచి 1300 ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ కింద చెరువుల్లో మట్టి తవ్వకాల పనులకు ఇక అనుమతి లేదని ఆయన తెలిపారు. రూ.140కోట్లతో ఇరిగేషన్ కాలువల నిర్మాణాలు, ఇతర మెటీరియల్ కాంపొనెంట్, చెరువుల అనుసంధాన పనులు మాత్రమే జరుగుతాయని తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ డిఇఇ తిరుమలరావు ఉన్నారు.

ప్రలోభాల పనిలో అధికార, ప్రతిపక్షాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వైవి

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం అధికార ప్రతిపక్షాలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే పనిలో ఉన్నాయని సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటర్లకు పెడుతున్న ప్రలోభాలపైనా, ఎన్నికల కమిషన్ తీరుపైనా శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5 ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియ నుంచి జరగబోయే ఎన్నికల వరకు అన్ని దశల్లోనూ అధికార పార్టీ అక్రమ మార్గాల ద్వారానే గెలుపు సాధించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు. ఇప్పటికే విడుదల చేసిన ఓటరు జాబితాలో అర్హత లేని వారిని ఓటర్లుగా నమోదు చేయించారని, పట్టభద్రుల ఓటర్ల లిస్టులో కేవలం పదవ తరగతి, ఐదో తరగతి చదివిన వ్యక్తుల పేర్లు ఉండటంతో ఓటరు నమోదు ప్రక్రియ ఏ విధంగా జరిగిందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. రాష్ట్రంలో నేటి వరకు 8వేలకు పైగా తప్పుడు ఓటరు నమోదులను గుర్తించినట్లు తెలిపారు. దీనిపై ఎన్నికల కమిషన్ అధికారులకు తెలియజేసినప్పటికీ తూతు మంత్రంగానే స్పందిస్తున్నారు తప్ప, జరిగిన తప్పిదాలపై చర్యలు తీసుకోవడం లేదన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ ప్రభుత్వం పథకం ప్రకారం అధికారులందరినీ ప్రభుత్వానికి అనుగుణంగా ఎన్నికల్లో ఉపయోగించుకుంటూ ముందుకు సాగుతుందని అన్నారు. ఇప్పటికే ఓటర్లను ప్రభుత్వం అన్ని రకాల ప్రలోభాలకు గురి చేస్తూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తుందని అన్నారు. పార్వతీపురం నియోజవర్గం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రత్యక్షంగా ఓటర్లను, అధికారులను అధికార పార్టీకి అనుకూలంగా ఉపయోగించుకుంటూ, పిడిఎఫ్ అభ్యర్థిని ఓడించేందుకు కుయుక్తులు పన్నుతున్నారని అన్నారు. ఓటర్లంతా విచక్షణతో ఆలోచించి అధికార ప్రతిపక్ష పార్టీలు చూపే ప్రలోభాలకు మోసపోకుండా శాసనమండలిలో ప్రజా సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. సిపిఎం మన్యం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో అధికార పార్టీ నాయకులు మహిళా దినోత్సవం పేరిట వాలంటీర్లను ఉపయోగించుకొని మహిళ ఓటర్లకు చీరలు పంపిణీ చేశారని తెలిపారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించి వారి దగ్గర ఓట్లు అడిగే ధైర్యం లేక అధికారబలాన్ని ఉపయోగించి ఓటర్లను ఇబ్బంది పెడుతోందని అన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ నాయకులు గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ముగిసిన సాంకేతిక సదస్సు



బహుమతులను అందజేస్తున్న రవివర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియులో కంప్యూటర్ సైన్స్ విభాగంలో జరిగిన రెండు రోజుల జాతీయ సాంకేతిక సదస్సు శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన పెన్నా టెక్నాలజి ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ రవివర్మ దాట్ల మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచు కోవాలని అన్నారు. లేదంటే ఈ పోటీ ప్రపంచంలో ఉద్యోగం కష్టమని, పుస్తకాలలో ఉన్న నాలెడ్జ్‌కు మాత్రమే పరిమితం కాకుండా టెక్నాలజీని నేర్చుకోవాలని అన్నారు. జెఎన్‌టియు రిజిస్ట్రార్ జి.స్వామి నాయుడు మాట్లాడుతూ ప్రతి విభాగంలో విద్యార్థి ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థికి పోటీదారుడేనని, నైపుణ్యాలు మెరుగు పరుచుకుంటే తప్ప ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోలేమని తెలిపారు. సదస్సుసందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.గ్రీకుమార్, పి.అరుణకుమారి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ ఎస్.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహించనున్న నేపథ్యంలో 144 సెక్షన్ విధిస్తున్నట్లు తహశీల్దార్ టి కల్యాణ చక్రవర్తి, ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ 144 సెక్షన్ శనివారం నుంచి అమలు కానున్నట్లు తెలిపారు. రేగిడి మండలంలో 26, 27 పోలింగ్ కేంద్రాల్లో 1408 పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు ఓటింగ్ ఉంటుందన్నారు. వికలాంగులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ర్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏజెంట్లకు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ఉండాలన్నారు.

అందరి నోటా రమాప్రభ గెలుపుమాట

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈనెల 13న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఏ నోట విన్నా పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలుపుమాటే వినిపిస్తోంది. ఆమె గెలుపు తథ్యమంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, విద్యార్థులు సహా అందరి పబ్లిక్ టాక్. ఈ ఎన్నికల్లో రాజకీయ పార్టీల తరపున పోటీస్తున్న అభ్యర్థులను ఆదరించే పరిస్థితి లేదన్న వాదన కూడా వ్యక్తమౌతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. విధానాల పరంగా వైసిపి, టిడిపిల మధ్య తేడా లేదు. పిపిఎస్ విధానం తీసుకొచ్చింది చంద్రబాబు ప్రభుత్వం. దాన్ని వారం రోజుల్లో రద్దుచేస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి తీరా అధికారంలోకి వచ్చాక రద్దు కుదరదంటూ తమ మంత్రులు, సలహాదారులతో కుండబద్దలు కొట్టినట్లు చెప్పించారు. పైగా కొత్తగా జిపిఎస్ తీసుకొస్తామంటూ చెబుతున్నారు.

ఇప్పుడు టిడిపి తరపున ఎమ్మెల్సీ బరిలో నిలిచిన అభ్యర్థి సిపిఎస్ రద్దు మాట వైసిపి నిలబెట్టుకోలేదంటూ విమర్శిస్తున్నారు. సిపిఎస్ విధానం అమలే టిడిపి హయాంలో జరిగింది కదా? అని ప్రశ్నిస్తే ఆ అభ్యర్థి నాలుక కరుచుకున్న దుస్థితి చోటుకుసుకుంది. ఇక ఉత్తరాంధ్ర అభివృద్ధికి తలమానికంగా వున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విదేశీ బహుళజాతి సంస్థకు అమ్మజూపుతుంటే ఇటు వైసిపిగానీ, అటు టిడిపిగానీ కేంద్రం వద్ద నోరు మెదపడం లేదు. ప్లాంటు ఎదుట సిఐటియు సహా పలు కార్మిక సంఘాల మద్ధతుతో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్దకు ఈ రెండు పార్టీలకు చెందిన నాయకులు వచ్చిమొసలి కన్నీరు కార్చారు. ఇక 2014 ఎన్నికల్లో బాబు వస్తేనే జాబు అన్న టిడిపి జిల్లాలో వున్న కొద్దిపాటి జ్యూట్ మిల్లుల మాసివేతకు కారణమైంది. ఆ తరువాత 2019లో ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానన్న సిఎం జగన్మోహన్‌రెడ్డి ఉన్నవాటిని మూసివేశారు. దీంతో, జిల్లాలో కొత్తగా జాబులు రాలేదు సరికాదా, ఉన్న ఉద్యోగులు, ఉపాధి మార్గాలు కూడా లేకుండా పోయాయి. దీంతో, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం చదువుకున్న యువత సైతం ఉద్యోగాల కోసం ఎప్పటి మాదిరిగానే సుదూర ప్రాంతాలకు వలస కూలీల మాదిరిగా పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయం, సాగునీటి వనరుల అవృద్ధిపైనా ఈ రెండు ప్రభుత్వాల వైఖరీ ఒక్కటే.



జిల్లాలో ఎన్నో జీవనదులు ఉన్నా వాటిపై రిజర్వాయర్లు నిర్మించలేదు. తోటపల్లి, జంఝావతి, తారకరామ తీర్థసాగర్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటిని ఆశగా చూపి ఏటా సాధారణ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడం మినహా వాటిని పూర్తిచేయాలన్న చిత్తశుద్ధి పాలకపార్టీల్లో మచ్చుకుకూడా కనిపించడం లేదు. మరో మాటలో చెప్పాలంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి సరెండర్ అయిపోయాయి. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చక పోయినప్పటికీ ఇటీవల జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో టిడిపి, వైసిపిలు పోటీపడి మరీ బిజెపి తరపున పోటీచేసిన ద్రౌపతిమర్ముకు ఓట్లేసి గెలిపించాయి. ఈనేపథ్యంలో రెండు పార్టీల జెండాలు మారినా అజెండా ఒక్కటేనన్న విషయం తమకు స్పష్టంగానే బోదపడిందని పట్టభద్ర ఓటర్లు చర్చించు కుంటున్నారు. మరోవైపు పిడిఎఫ్ తరపున పోటీచేస్తున్న డాక్టర్ కోరెడ్ల రమాప్రభ గెలుపు దిశగా పయనిస్తున్నారని మెజార్టీ ఓటర్ల మనోగతంగా వినిపిస్తోంది. ఈనేథ్యంలోనే పాలకపార్టీల తరపున పోటీచేస్తున్న అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేస్తామని అధినేతలకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యేలు, ఇతర నాయకులకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఈనేపథ్యంలో నైతికతను పక్కనబెట్టి డబ్బు, మద్యం, కానుకలను ఎరజూపేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

పిడిఎఫ్ ఎమ్మెల్సీలంతా... తొలి నుంచీ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తున్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎంవిఎస్ శర్మ ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం ప్రజల గొంతుగా పనిచేశారు. కేవలం శాసన మండలిలోనే కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎన్నో సమస్యలను అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఆ తరువాత టిడిపి మద్ధతుతో ఎమ్మెల్సీగా ఎన్నికైన పెద్దమనిషి గడిచిన ఆరేళ్లలో పత్తాకు కూడా కనిపించలేదు. విభజన హామీల గురించిగానీ, స్టీల్‌ప్లాంట్ విక్రయంపైగానీ ప్రశ్నించలేదు. మరోవైపు పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ ఇప్పటి వరకు ప్రజాసేవకు అంకితమై పనిచేశారు. ఈనేపథ్యంలో పిడిఎఫ్ తరపున పోటీలో నిలిచిన డాక్టర్ కోరెడ్ల రమాప్రభకే ఓట్లేయాలన్న తలంపుతో ఉన్నామని ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మెజార్టీ ఓటర్లు చెబుతున్నారు.

మరో రూ.7 కోట్లు అవసరం

ప్రజాశక్తి-మక్కువ

మండల కేంద్రంలో నాలుగు లైన్ల సిసి రోడ్ విస్తరణ పనులకు మరో రూ. 7 కోట్లు అవసరమని సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు జెడ్‌పిటిసి మావుడి శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల సిఎం జగన్మోహన్‌రెడ్డిని డిప్యూటీ సిఎం రాజన్నదొర, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి రోడ్డు గురించి వివరించినట్లు శనివారం ప్రజాశక్తికి తెలిపారు. మండలంలో సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. మక్కువ ప్రధాన రహదారి అధ్వానంగా తయారైన నేపథ్యంలో ప్రజలు ఎన్నో అవస్థలకు గురికావాల్సి వస్తుందని భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నాలుగు లైన్ రహదారి నిర్మాణం ప్రతిపాదించామని అయితే వాటికి సరిపడే నిధులు మంజూరు చేయాలని సిఎంను కోరినట్లు తెలిపారు. దీనికి సిఎం సానుకూలంగా స్పందించారని ఆయన అన్నారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన కుటుంబాలను ఆదుకునేందుకు కూడా ప్రణాళిక తయారు చేయాలని ఇప్పటికి అధికారులుకు ఆదేశించారని ఆయన తెలిపారు.

రిజర్వేషన్ల ప్రకారమే ప్రవేశాలు

ప్రజాశక్తి-వేపాడ

ప్రయివేటు పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి రిజర్వేషన్ల ప్రకారమే ప్రవేశాలు కల్పించాలని ఎంఇఒ జి.శ్రీదేవి ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. అనాథ పిల్లలకు, వికలాంగులకు ఐదు శాతం, ఎస్‌సిలకు 10 శాతం, ఎస్‌టిలకు నాలుగు శాతం, బిసి, మైనార్టీ, ఒసి తరగతుల వారికి 6 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం జిఒ విడుదల చేసిందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రతి ప్రయివేటు పాఠశాల యాజమాన్యం గుర్తించాలని ఆదేశించారు. ఎక్కడైనా రిజర్వేషన్ పాటించలేదని ఆరోపణ వస్తే యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇక ఆరో తరగతి క్లాస్‌లు ప్రారంభం

ప్రజాశక్తి- మెరకముడిదాం

2023-24 విద్యా సంవత్సరం నుండి ఎంఎస్‌ఎన్ ఇంగ్లీష్ మీడియం పెద్దమంత్రిపేట పాఠశాలలో ఆరో తరగతి క్లాస్‌లు ప్రారంబిస్తామని పాఠశాల కరెస్పాండంట్ మంత్రి రాము తెలిపారు. పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థుల తల్లి తండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న విద్యార్థుల తల్లి తండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న తమ పిల్లలకు 5వ తరగతి అనంతరం ఇతర పాఠశాలలో 6వ తరగతికి పంపించడం కంటే ఈ పాఠశాలలోనే ఆరో తరగతి క్లాస్‌లు ప్రారంభిస్తే భాగుంటుందని అన్నారు. అనంతరం పాఠశాల కరెస్పాండంట్ మంత్రి రాము మాట్లాడుతూ విద్యార్థుల తల్లి తండ్రుల అభిప్రాయం మేరకు ఉపాధ్యాయులతో చర్చించి 2023-24 విద్యా సంవత్సరం నుండి ఆరవ తరగతి క్లాస్‌లు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి-సీతంపేట

ఐటిడిఎ పరిధిలో గల పలు టూరిజం ప్రాంతాలను పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఓ ఆనంద్ శనివారం పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సీతంపేట ఐటిడిఎను సందర్శించారు. ఈ సంధర్భంగా తురాయ పువలసలో ఉన్న ఉద్యానవన శాఖకు సంబంధించిన నర్సరీని పరిశీలించారు. నర్సరీలో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సెరికల్చర్ నర్సరీని పరిశీలించారు. ఐటిడిఎలోని గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో గల జిమ్‌ను పరిశీలించారు. జిమ్ అత్యాధునికంగా నిర్మించారని కొనియాడారు. జిల్లాలో ఎక్కడా ఇటువంటి జిమ్ లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఒ బి.నవ్య డిపిఒ సతీష్ కుమార్, ఇంచార్జ్ జాకబ్ దయానంద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయంపై ర్యాలీ

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

సేంద్రియ వ్యవసాయ పద్ధతులు అవలంభించడం ద్వారా రసాయన ఎరువుల ఖర్చు తగ్గడమే కాకుండా, పంట భూములను సారవంతంగా తయారు చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం కమ్యూనిటీ మేనేజ్, పార్వతీపురం విభాగం కోఆర్డినేటర్ వై శ్రీరాములు అన్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మార్ నగరంలో ఉపసర్పంచి వంగపండు త్రినాధ నాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను కలిసి భూములను సారవంతంగా చేసుకోవడానికి 30 రకాల విత్తనాలను పొలాల్లో జల్లుకొని ఆ తర్వాత వాటిని కలియదున్నుకుంటే భూములు సారవంతంగా మారి దిగుబడి అధికంగా వస్తుందని, తద్వారా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని వివరించారు.

ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రధాన అర్చకులు మల్లికార్జున శర్మ

ఆకట్టుకున్న గీతాలాపన

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రామతీర్థం పుణ్యక్షేత్రంలో శనివారం నిర్వహించిన గీతాలాపన ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సంతకవిటి మండలం, వాల్తేర్ గ్రామానికి చెందిన శ్రీ విజయ గణపతి భజన బందం సభ్యులు ఈ గీతాలను ఆలపించారు. భక్తులను ఆకట్టుకునేలా ఆలపించిన భజన బృందం సభ్యులకు ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి మల్లిఖార్జున శర్మ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు.

దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సన్యాసిరావు, తదితరులు

ముస్లిములకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బొద్దాం గ్రామంలో 250 మంది ముస్లిములకు బక్రీద్ సందర్భంగా దుస్తులు, స్వీట్లు, నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి పి.లక్ష్మి, గ్రామ నాయకులు ఎర్ర సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకటబైరిపురంలో గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని వెంకట బైరిపురంలో శని వారం సుమారు పది గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామంలోని వాటర్ ట్యాంక్ సమీపాన రైతులు పశువుల మేత కోసం గడ్డిని నిల్వ వేసు కున్నారు. ఈ ప్రమాదం లో శీర కాశినాయుడుకు చెందిన ఐదు, శీర.పైడిపునాయుడువి రెండు, బిక్కిని వెంకన్నబాబువి ఒకటి, యండమూరి త్రినాధకు చెందిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తుల పనైనా లేక విద్యుత్ వైర్లు పై ఉండడంతో ఏమైనా ప్రమాదం సంభవించిందా అన్న అనుమానాలు వ్యక్తవుతున్నాయి.

ప్రణాళికా బద్ధంగా చదవాలి

ప్రజాశక్తి - సీతంపేట

పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తీర్ణత తప్పనిసరిగా సాధించవచ్చని మండలంలోని దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ గొర్రె సుబ్బారావు అన్నారు. ఆ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సుబ్బారావు మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్నాయని, తక్కువ సమయం ఉన్నందున అలక్ష్యం చేయకుండా చదువుకోవాలని కోరారు.

మండలిలో ప్రజావాణి వినిపిస్తా

విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వ విఫలం : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

రిమ్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, రణస్థలం

తనను గెలిపిస్తే శాసన మండలిలో ఉత్తరాంధ్ర ప్రజల వాణిని వినిపిస్తానని పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ అన్నారు. శనివారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్), వైద్య కళాశాల, రణస్థలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. బాగా వెనుకబడ్డ ఉత్తరాంధ్ర జిల్లాల్లో సరైన వైద్య సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్రీకాకుళం రిమ్స్ వైద్య కళాశాల ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా బాలారిష్టాలు వీడలేదన్నారు. భవనాలు నిర్మించినా మెడికల్ కళాశాల, ప్రజా వైద్యశాలలో పని చేసేందుకు సరిపడ వైద్యులు, ఇతర సిబ్బంది లేరన్నారు. కాంట్రాక్టు సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోందన్నారు. వీరిని రెగ్యులర్ చేయాల్సిన ప్రభుత్వం ఏళ్ల తరబడి వెట్టి చాకిరి చేయిస్తోందని విమర్శించారు. జిల్లా నుంచి స్పీకర్, ఇతర శాఖల మంత్రులు ఉన్నా జిల్లాలో అభివృద్ధి కాదు కదా, మరింత వెనుకబాటుకు నెట్టబడుతోందని అన్నారు. 194 కిలోమీటర్ల సుదూర తీర ప్రాంతం కాలుష్యం బారిన పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్యాకేజీ, రైల్వేజోన్, మెట్రో రైల్ వంటి అంశాల్లో రాష్ట్రానికి కేంద్రం ద్రోహం చేసిందని అన్నారు.

స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిందని చెప్పారు. దీన్ని ప్రశ్నించాల్సిన అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఆ పని చేయడం లేదని అన్నారు. ద్రోహం చేసిన కేంద్ర ప్రభుత్వంతో దోస్తీ చేస్తున్నాయని చెప్పారు. ప్రజా సమస్యలపై మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే నిలదీస్తున్నారని అన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల బలం మండలిలో ఎంత పెరిగితే పట్టభద్రులు, వివిధ తరగతుల వాణిని వినిపించే అవకాశం ఉంటుందని చెప్పారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి, గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఐద్వా నాయకులు లక్ష్మి. పాణిగ్రాహి, ఆర్.సురేష్‌బాబు, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

'వాడు ఎవడు' సినిమాను ఆదరించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి ప్రాంతంలో చిత్రీకరించిన 'వాడు ఎవడు' సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని నిర్మాత ఎన్.శ్రీనివాసరావు కోరారు. సాయిగణపతి థియేటర్‌లో 'వాడు ఎవడు' సినిమాను ప్రదర్శిస్తున్నారు. థియేటర్‌లో చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా నిర్మాత శ్రీనివాసరావు మాట్లాడుతూ తనది చింతాడ గ్రామం కావడంతో సొంతూరుపై అభిమానంతో బొబ్బిలి ప్రాంతానికి చెందిన కొంతమందికి సినిమాలో నటించే అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. బొబ్బిలి, రాయగడ ప్రాంతాల్లో చిత్రీకరించామని, ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ వస్తోందని చెప్పారు.

మాట్లాడుతున్న చిత్ర నిర్మాత శ్రీనివాసరావు



మృతిచెందిన జగదీశ్వరి (ఫైల్)

యువతి రాసిన లేఖ

యువతి ఆత్మహత్య కేసులో

లేఖ కలకలం

ఆ ముగ్గురే కారణమని వెల్లడి

ప్రజాశక్తి - జామి

భీమసింగి పంచాయతీ కొత్త భీమసింగి గ్రామానికి చెందిన బోని మద్దిల జగదీశ్వరి ఆత్మహత్య కేసులో అనేక కోణాలు వెలుగు చూస్తున్నాయి. ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఆ యువతి రాసిన లేఖ బయటపడింది. శుక్రవారం భీమసింగి రైల్వే ట్రాక్‌పై జగదీశ్వరి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. స్థానిక సెల్ ఫోన్ షాపు నిర్వాహకుడు వేధింపుల వల్లే తన కుమార్తె ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి కుటుంబీకులు, బంధువులు ఆరోపించారు. ఆమె ఇంట్లో ముందుగా ఓ లేఖ రాసిపెట్టి ఉంచినట్లు తెలియడంతో ఒక్కసారిగా జగదీశ్వరి ఆత్మహత్య కేసు మలుపు తిరిగింది. తన చావుకు కారణం చిన్ని రామకోటి, మార్న కళ్యాణ్, సరపనేటి వెంకట సాయి అని, వారి వేధింపుల వల్లే తాను మరణిస్తున్నానని ఆమె లేఖలో రాసినట్లు తెలిసింది. అయితే ఆ లేఖ జగదీశ్వరి రాసిందా..? లేదా అన్నదానిపై తేలాల్సి ఉంది. ఆ లేఖ జగదీశ్వరి స్వహస్తాలతో రాసిందేనని తల్లిదండ్రులు చెబుతున్నారు. జగదీశ్వరి పట్ల వేధింపుల విషయం ఇప్పటికే జామి పోలీసు స్టేషనుకు వెళ్లినట్లు తెలిసింది. అప్పట్లో కేసు నమోదు చేసి, నిందితుడిపై చర్యలు తీసుకొని ఉంటే జగదీశ్వరి ఆత్మహత్య చేసుకుని ఉండేది కాదని బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే అప్పట్లో ఈ కేసును రాజకీయ నాయకులు రాజీ చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా పోలీసులు సమగ్ర దర్యాప్తు చేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బంధువులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎస్ఐ వీరబాబును వివరణ కోరగా, ఇంకా కేసు రైల్వే పోలీసుల పరిధిలో ఉందని చెప్పారు.

'లెండి'లో డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్

డ్రోన్ టెక్నాలజీపై వివరిస్తున్న మారుతీ డ్రోన్‌టెక్ ప్రతినిధి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- డెంకాడ

జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'డ్రోన్ టెక్నాలజీ అండ్ ఇట్స్ అప్లికేషన్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. హైదరాబాదుకు చెందిన డ్రోన్ తయారీ సంస్థ మారుత్ డ్రోన్ టెక్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధులు హాజరై డ్రోన్ల వినియోగంపై విద్యార్థులకు వివరించారు. డ్రోన్ టెక్నాలజీపైన కోర్సులు, ఉపాధి అవకాశాలపై చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి. రామారెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

ఇలాంటి ఆధునిక కోర్సులను తమ కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉంచుతామన్నారు. కళాశాలలో డ్రోన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ల్యాబ్ ఏర్పాటు దిశగా చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహుకులు డాక్టర్ ఎం. రాజన్‌బాబు, డీన్ డాక్టర్ ఎవి పరంకుశం, డాక్టర్ బి. శ్రీధర్, డాక్టర్ నరేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాడంగి.. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్రతిఒక్కరూ ఉత్తీర్ణులు కావాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణులు కావాలని ధర్మవరం హైస్కూల్ హెచ్‌ఎం బి.లక్ష్మి ఆకాంక్షించారు. శనివారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులపై ఒత్తిడి చేయొద్దని తల్లిదండ్రులకు సూచించారు. టీవీకి, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహీం షేక్ లాల్, విఇ సత్యనారాయణ, బి.జయ, కిరణ్, సఖీనా, శ్రావణి, అనంతలక్ష్మి, పిఎంసి చైర్మన్ తగరంపూడి రమణ, హాస్టల్ వార్డెన్ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

బాడంగి : బాడంగి హైస్కూల్లో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్‌ఎం సిద్ధాంతం త్రినాథరావు సమావేశాన్ని ఏర్పాటుచేశారు. త్వరలో జరగబోవు పదోతరగతి పరీక్షలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులు కావాలంటే ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలని చెప్పారు. గ్రాండ్ టెస్ట్‌లో మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు.

వేపాడ : మండలంలోని ఎస్‌కెఆర్‌పురం హైస్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి తీర్మానించారు.

25 మంది రక్తదానం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గుణుపూరుపేటలో విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన, ఉచిత మెగా వైద్య శిబిరం, ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని గుణుపూరుపేట ఎంపిటిసి బి. రామునాయుడు ప్రారంభించారు. రక్తదాన శిబిరంలో 25 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. వీరికి సంవత్సరం పాటు ప్రమాద బీమా పాలసీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిమ్స్ ఆస్పత్రి నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం, ఉచిత నేత్ర వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. ఖరీదైన, ఉన్నత ప్రమాణాలు కలిగిన వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. ఎంపిటిసి మాట్లాడుతూ ఎందరో పేదలు కార్పొరేట్ వైద్యానికి నోచుకోలేకపోతున్నారని అటువంటి వారికి ఈ వైద్య శిబిరం ఒక వరమని అన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

ఈ శిబిరానికి విజయనగరం యూత్ ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. శిబిరాన్ని ఏర్పాటు చేసిన విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్ ఇల్తామాష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, రాయల్ క్యాబ్స్ శరత్, రాము, విజయ్, రఘు, గుణుపూరు పేట, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంను కలిసిన అవనాపు

సాలూరు : డిప్యూటీ సిఎం రాజన్నదొరని శనివారం వైసిపి యువజన విభాగం జోనల్ ఇంఛార్జి అవనాపు విక్రం కలిశారు. పార్వతీపురం మన్యం, పాడేరు జిల్లాలకు యువజన విభాగం జోనల్ ఇంఛార్జిగా వైసిపి నియమించింది. ఈ నేపథ్యంలో ఆయన డిప్యూటీ సిఎం రాజన్నదొరని కలిసి నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ ఉన్నారు.

ధ్వంసం చేసిన విగ్రహాలకు ఫైబర్ రంగులు

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న దేశ నాయకుల విగ్రహాలకు మరమ్మత్తులు జరిపి రంగులు పూచారు. ఇటీవల పాఠశాలలో మైనర్ బాలుర విద్యార్థులు మహాత్మా గాంధీ, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్ తదితర దేశ నాయకుల విగ్రహాల ముక్కు, చెవులు, బుగ్గలు శరీరం భాగాలను ధ్వంసం చేశారు. వీరిపై పోలీసులు కేసుల నమోదు చేస్తూ, విజయనగరం బాలల సదనముకు కౌన్సిలింగ్ కోసం తరలించారు. దేశ నాయకుల విగ్రహాలు ధ్వంసం పై ప్రజాశక్తిలో కథనం వెలువడింది. పోలీసులు, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ కలిసి 9 మంది దేశ నాయకుల విగ్రహాలకు మరమ్మతులు జరిపి ఫైబర్ రంగులు వేశారు.

మరమ్మతులు చేసిన గాంధీ విగ్రహం

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-గంట్యాడ

గంట్యాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహశీల్దార్ ప్రసన్న రాఘవ శనివారం పరిశీలించారు. ఈ పాఠశాలలో మొత్తం మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సిద్ధం చేసిన ఫర్నీచర్‌ను పరిశీలించారు. పోలింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై రెవెన్యూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ స్వర్ణ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు హరిప్రియ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహశీల్దార్ ప్రసన్న రాఘవ

నవధాన్యాల సాగుతో భూసారం

ప్రజాశక్తి-కొత్తవలస

నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని మాస్టర్ ట్రైనర్ పి.కోటిబాబు తెలిపారు. తుమ్మికాపల్లి క్లస్టర్‌లోని దేవాడ గ్రామంలో సబల సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో గ్రామ పెద్దలు, రైతులతో రైతు భరోసా కేంద్రం సిబ్బంది శనివారం ర్యాలీ నిర్వహించారు. నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వేసవిలో విత్తనాలను గుళికలు రూపంలో చేసి భూమిలో వేయడం వల్ల విత్తనాలు ఎండ తీవ్రతను, నీటి ఎద్దడిని, చీడపీడలను తట్టుకొని మొలకెత్తి రైతులకు మంచి ఆదాయాన్నిస్తాయని క్లస్టర్ సిఎ ఎం.శ్రావ్య తెలిపారు. కార్యక్రమంలో విఎఎ శ్రావణి, ఐసిఆర్‌పి సత్యవతి పాల్గొన్నారు.

రేగిడి : మండలంలోని గుల్లపాడు గ్రామంలో విత్తన గుళికలపై రైతులకు శనివారం మాస్టర్ ట్రైనర్ సిహెచ్ శారద అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందరావు, ఎన్ఎఫ్ఎ మెర్సీ ఎల్ 2, ఎల్ 3 నిర్వహించిన విత్తన గుళికల తయారీ విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల వద్ద ఉన్న విత్తనాలను సేకరించి వాటితో పాటు కూరగాయ విత్తనాలు, చిరుధాన్యాలను, పచ్చిరొట్టి విత్తనాలు, సుగంధ ద్రవ్యాలు పప్పులు, జీలుగా జనుము, పిల్లి పెసర వంటివి తీసుకోవాలన్నారు. దీంతో విత్తన గులుకులు తయారు చేయవచ్చన్నారు. నవధాన్యాలు వేయడం వల్ల నేలలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది గాలిలో ఉన్న కార్బన్ పదార్థాన్ని భూమిలో నిలవచేసి భూమిలో నీటిని నిలుపుకొని సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రకతి వ్యవసాయం ఎంతో మేలని, భూమి సారవంతమై ఆరోగ్యకరమైన పంటలు పండి మానవ జీవన మనుగడ పెరుగుతుందన్నారు. ఈ నవధాన్యాలు వల్ల భూమిలో నత్రజని స్థాపన జరిగి తదుపరి పంటకు పోషక పదార్థాలు భూమిలో పెరిగి భూమి సారవంతం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చాటాయవలస సర్పంచ్ కరణం గోవిందరావు, రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్ సింహాచలం, బి. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న సబల సంస్థ ప్రతినిధులు

రక్తహీనతపై అవగాహన

రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని తుమ్మికాపల్లి సచివాలయ పరిధిలోని సీతంపేట, గాంధీనగర్, దత్తి, అంగన్వాడీ కేంద్రంలో సఖి కార్యక్రమంలో భాగంగా రక్తహీనతపై శనివారం వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి గోపాలకృష్ణ అవగాహన కల్పించారు. రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణులు, బాలింతలు, బాలికలకు సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై వివరించారు. మాత, శిశు మరణాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సింహాద్రినాయుడు, హెచ్‌వి పద్మావతి, ఎంపిహెచ్‌ఇఒలు గోవిందరాజులు, తిరుపతి రావు, హెచ్. ఎస్. రాము, కామేశ్వరి, స్వప్న, ఎఎన్‌ఎంలు జ్యోతి, తులసి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఆశా, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - వంగర

మండల కేంద్రానికి చెందిన రౌతు సూరి నాయుడు (మేస్త్రి) ఇటీవల కాలంలో అనారోగ్యం కారణంగా మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో పాటు వంగర ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, మండల వైసిపి కన్వీనర్ కరణం సుదర్శనరావు, పాలవలస ధవళేశ్వర రావు, స్థానిక సర్పంచ్, కనగల పారి నాయుడు, శివ్వాం సర్పంచ్ బొక్కేల వెంకటఅప్పలనాయుడు, నాయకులు బూరాడ వెంకటరావు, మండల మహిళా అధ్యక్షురాలు కాంబోతుల భగవతి, వెంకట్ నాయుడు, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

సూరినాయుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్